క్లుప్తంగా

మహానందిలో శ్రావణ సందడి



మహానందీశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: శ్రావణమాసం కావడంతో మహానంది క్షేత్రం నిత్యం భక్తులతో కళకళలాడుతోంది. కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఆలయానికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. అక్కడికి వచ్చిన భక్తులు మహానందీశ్వర స్వామి దర్శనానికి వస్తుండడంతో భక్తుల సందడి నెలకొంది. భక్తులు కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

కుమారస్వామికి పూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి, బయలు వీరభద్ర స్వామికి మంగళవారం సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం




మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

వెలుగోడు: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సురేష్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, మెరీబా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ కాలేజీలో ఇంటెన్సిఫైడ్ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ (ఐఈసీ) క్యాంపెయిన్, హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, ఎన్నో రకాలుగా సోకుతుందని చెప్పారు. ఎయిడ్స్ రోగులను చులకనగా చూడరాదన్నారు. కార్యక్రమంలో మెరిబా ప్రాజెక్ట్ మేనేజర్ జుల్ఫికర్, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్, సీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అమూల్య పాల్గొన్నారు.

- **ఆత్మకూరు:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పద్మావతిభాయ్, మెరిబా ప్రాజెక్టు మేనేజర్ జుల్ఫీకర్ విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.లక్ష విరాళం



దాతని సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి మంగళవారం విజయవాడకు చెందిన ఎస్.సత్యప్రసాద్ రూ.1,11,000 విరాళాన్ని పర్యవేక్షకులు రవికుమార్‌కు అందజేశారు. దాతకు రశీదు, లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

వీడని వర్షం

వర్షం వీడటం లేదు. రెండు రోజులుగా కురుస్తూనే ఉంది. వర్షపు నీటిలో పైర్లు మునిగిపోవడటంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు. అక్కడక్కడా రోడ్లు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొత్తపల్లి మండలంలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పల్లెల్లో అంధకారం నెలకొంది. జూపాడుబంగ్లా మండలం పారుమంచాల చెరువు నిండటంతో గ్రామస్తులు సంతోషంతో గంగమ్మకు పూజలు చేశారు. ఆత్మకూరు పట్టణంలో డ్రైనేజీలు సరిగా లేక వర్షపు నీరు, మురుగు నీరు కలిసి రోడ్లపై ఎక్కి పారాయి. బండిఆత్మకూరు మండలంలో పంట పొలాలన్నీ వర్షార్పణమయ్యాయి. వెలుగోడు మండలంలో ఏఓ నీటమునిగిన పొలాలను పరిశీలించి నీటిని బయటకు పంపే చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు





భారీ వర్షానికి నేలవాలిన విద్యుత్ స్తంభాలు

కొత్తపల్లి: మండలంలో మంగళవారం కూడా వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారే వరకు ఎడతెరిపి లేకుండా వాన పడటంతో 40.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా భారీ వర్షం కారణంగా గువ్వలకుంట్ల నుంచి పాలెంచెరువు గూడెం వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో గూడేనికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వీరాపురం, బండినాయిని పాలెం, గువ్వలకుంట్ల, కొత్తపల్లి పొలిమేర్లలోని వరి పొలాలు వర్షపునీటిలో మునిగిపోయాయి. నందికుంట, బావాపురం, దుద్యాల, ఎదురుపాడు, కొక్కెరంచ, గోకవరం, లింగాపురం, శివపురం గ్రామాల మొక్కజొన్న పంటల్లో నీరుచేరింది. ఏపుగా పెరుగుతున్న పైర్లు వర్షానికి దెబ్బతింటాయేమోనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.



గువ్వలకుంట్ల సమీపంలో నీటమునిగిన వరిపొలాలు

పగిడ్యాలలో 26.4 మి.మీ

పగిడ్యాల: మండలంలో 26.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి అన్నదాత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పైర్లు తురాయి దశకు చేరుకోగా మందు వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. భూమిలో తేమ శాతం అధికంగా ఉన్నందున మరో పదిహేను రోజుల వరకు వర్షం కురవకపోయినా పైర్లు బెట్టపోవని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిండిన పారుమంచాల చెరువు

జూపాడుబంగ్లా: భారీ వర్షానికి మండలంలోని పారుమంచాల చెరువు నిండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రైతులు చెరువు తూము వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పంటలు బాగా పండేలా ఆశీర్వదించాలని వాయనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



చెరువు నిండటంతో గంగమ్మకు వాయనం సమర్పించి మొక్కులు తీర్చుకొంటున్న ఆయకట్టు రైతులు

ఆత్మకూరులో 39.4 మి.మీ. వర్షం



ఆత్మకూరు: మండలంలో మంగళవారం వేకువజామున 39.4 మి.మీ. వర్షం కురిసింది. భవనాశి, సుద్దవాగులు భారీగా పొంగి ప్రవహించాయి. పలుచోట్ల చిన్నచిన్న వంకలు సైతం నీరు ప్రవహించడంతోపాటు పట్టణ శివారులోని కాలనీల్లో వర్షపునీరు చేరి ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఆత్మకూరు మండలంలో పొలాల్లో నిలిచిన వర్షపునీరు

రైతుల కష్టం వర్షార్పణం

బండి ఆత్మకూరు: గత రెండు రోజుల నుంచి కురిస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో వరి పంట నీట మునిగింది. ఇప్పటికే 24 గంటలు గడిచినా ఇంకా పొలాల్లో నీరు తగ్గకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని కుందూ నదితో పాటు సంకల వాగు, మద్దిలేరు, గుంతెన వాగులు పొంగి పొర్లడంతో వరి పొలాలు నీటమునిగాయి. కొన్ని చోట్ల పొలాల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయింది.



సంకల వాగు ఉధృతికి నీట మునిగిన వరి పంట

మద్దిగుండం చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

నందికొట్కూరు: మిడుతూరు మండలం జలకనూరు మద్దిగుండం చెరువుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. చెరువుకు గండి పడిన ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. తక్షణమే గండి పూడ్చాలని నీటిపారుదల అధికారులకు సూచించారు. జేసీ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.



చెరువుకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

సమస్యలను పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఎం.ఎం.బాషా

ఆత్మకూరు: ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీపీటీడీఎస్‌ఎంయూ డిపో కార్యదర్శి ఎం.ఎం.బాషా, డిపో అధ్యక్షులు కరిముల్లా కోరారు. మంగళవారం స్థానిక డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌సీని వేయాలన్నారు. విజయవాడలోని గన్నవరం-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లూలు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ధర్నాలో ఎన్ఎంయూ నాయకులు ఎస్.ఆర్.రెడ్డి, హరినాథరెడ్డి, నిజాముద్దీన్, ఎంటీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

బావులకు గ్రిల్ ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: పట్టణంలోని రక్షిత మంచినీటి బావులకు గ్రిల్ ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి సుధాకర్ కోరారు. సిద్ధపల్లి రస్తా, వడ్లరామాపురం రస్తాలో ఉన్న బావులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న బావుల చుట్టూ గ్రిల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామ్‌నాయక్, వీరన్న, వలీ, దినేష్, సామేలు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



ప్రమాదకరంగా బావిని చూపుతున్న సీపీఎం నాయకులు

బాధిత కుటుంబానికి బీమా చెక్ అందజేత

పగిడ్యాల: ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం కింద మంజూరైన చెక్‌ను బాధిత కుటుంబానికి అందజేసినట్లు కెనరా బ్యాంక్ మేనేజర్ రాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. స్థానిక కెనరా బ్యాంక్‌లో ఖాతాదారుడు చాకలి శ్రీరాములు మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు ప్రధానమంత్రి జీవన బీమా యోజన పథకం ప్రీమియం చెల్లించినందున అతని భార్య లక్ష్మీదేవికి రూ.2 లక్షల చెక్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ నాగార్జున, రియాజుద్దీన్, ఎస్ఎస్‌టీ సంస్థ పీడీ ఆంజనేయులు ఉన్నారు.



బాధితురాలికి చెక్‌ను అందజేస్తున్న మేనేజర్ రాజ్యలక్ష్మి

16న కృష్ణాష్టమి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రామయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఉట్టి మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మహానందిలో ఎన్‌ఎస్‌టీఆర్ ఎఫ్‌డీపీటీ పూజలు

మహానంది: నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ కాశీ విశ్వనాథ రాజు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మహానంది వచ్చారు. వారు కామేశ్వరిదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా, ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలకగా దర్శనం అనంతరం స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. వారి వెంట డీఆర్‌ఓ హైమావతి ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం



అదృశ్యమైన విద్యార్థి ప్రిన్స్ బాబు

మహానంది: మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న యమ్మని ప్రిన్స్ బాబు అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఆత్మకూరు పట్టణానికి చెందిన ఈ బాలుడు సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి కనిపించడం లేదని ఉపాధ్యాయులు ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్కూల్‌లో చెప్పకుండా వెళ్లిన ఈ విద్యార్థి తిరిగి రాలేదని, ఎవరైనా గుర్తిస్తే తన సెల్: 9121101093 సమాచారం అందించాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

చెక్కుల పంపిణీ

జూపాడుబంగ్లా: అనారోగ్యంతో బాధపడేవారు, అకారణంగా మృతిచెందిన వారి కుటుంబసభ్యులు సీఎం రిలీఫ్‌ఫండును సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. తరిగోపుల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బాలస్వామి మృతిచెందగా అతని భార్య జయలక్ష్మికి, మండ్లెంలో షేక్‌నూర్జహాన్‌బీకి సీఎం రిలీఫ్‌ఫండు చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

- విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలి

ఆత్మకూరు: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ సాధ్యమని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో మంగళవారం చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మలమూత్ర విసర్జన తర్వాత, భోజనానికి ముందూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కుదుబ్‌బాషా పాల్గొన్నారు.

- **వెలుగోడు:** స్థానిక లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో విద్యార్థులకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగేశ్వరరావు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత వస్తుందన్నారు. ఆకలి మందగించి జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతాయన్నారు. నులిపురుగుల నివారణకు కచ్చితంగా మాత్ర వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.
- **శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.
- **జూపాడుబంగ్లా:** వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి నులిపురుగుల వ్యాప్తిని నివారించుకోవాలని డాక్టర్లు మౌనిక, యశస్విని, గంగాధర్, సభా సూచించారు. మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూపాడుబంగ్లా, పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని 0 నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి మింగించారు.



చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నందికొట్కూరు: ఆర్టీసీ కార్మిక సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆర్టీసీ డిపో అధ్యక్షులు రంగం జనార్దన్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డిపో గ్యారేజీ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం డిపో కార్యదర్శి జీవీ రత్నం, నాయకులు రఘురాముడు, సుధాకర్, వైడీఆర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపోలో గ్యారేజీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



అడవిపందులు చెడగొట్టిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

అడవి పందుల దాడి

- మొక్కజొన్న పంట నాశనం

కొత్తపల్లి/మహానంది: నల్లమల అటవీ సమీప ప్రాంతాల్లో అడవిపందుల బెడద తీవ్రమైంది. పంటపొలాల్లో జొరబడి పైర్లను నాశనం చేస్తున్నాయి. కొత్తపల్లి, మహానంది మండలాల్లో పలువురు రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. కంటికి రెప్పలా కాపాడుకున్న ఈపంట ప్రస్తుతం చేతికి వచ్చింది. మంగళవారం తెల్లవారుజామున ఆ పంటపొలాల్లోకి అడవి పందులు గుంపులుగా వచ్చి పంటలను నాశనం చేశాయి. దీంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని పెద్ద గుమ్మడాపురం, చిన్న గుమ్మడాపురం, గోపవరం గ్రామాల్లోని బాధిత రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ. 30 వేల నుంచి 40 వేల పెట్టుబడి పెట్టామని ఫారెస్టు అధికారులు స్పందించి నష్టపరిహారం అందించి, వాటి బారి నుంచి పంటలను కాపాలని వారు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న కోరారు. మంగళవారం జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామన్న మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే కాలనీలో వర్షం నీరు నిల్వ ఉంటోందన్నారు. దంతో దోమలు, విష సర్పాల సంచారంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. మురుగు కాలువలు ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవానలి ఆయన కోరారు. సీపీఎం నాయకులు రాజు, పుల్లయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.



నిలిచిన వర్షపు నీటిని చూపుతున్న నాయకులు, కాలనీవాసులు

వంతెన నిర్మాణం పూర్తిచేయాలి

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామ సమీపంలోని ఇసుకవాగు వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇసుకవాగును పరిశీలించారు. ఆరుమాసాల్లో పూర్తిచేస్తానన్న కాంట్రాక్టర్ మూడేళ్లైనా పూర్తి చేయకపోవడం తగదన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతోందని ఆరోపించారు.

పంచాయతీ అభివృద్ధి సూచికలపై శిక్షణ

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ సుమిత్రమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

పైర్లను కాపాడుకోండి

వెలుగోడు: పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించుకుని పైర్లను కాపాడుకోవాలని ఏఓ స్వాతి రైతులకు సూచించారు. మంగళశారం మోతుకూరు, మాధవరం గ్రామాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వర్షాల వల్ల పంటలకు కలిగిన నష్టాన్ని గుర్తించి, రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొలాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల పొలాల్లో నీటిని బయటకు పంపించాలని సూచించారు. వరి నారుమడుల్లో కిలో యూరియా, లీటరు పొటాష్ కలిపి చల్లాలన్నారు. నారుమడిలో తెగుళ్ల నివారణకు లీటరు నీటిలో గ్రాము కార్బెండిజం మందు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

చీకటి జీఓలను రద్దు చేయాలి

నందికొట్కూరు: కార్పొరేట్ విద్యాసంస్థల ప్రయోజనాల కోసం తెచ్చిన చీకటి జీఓలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు ఆది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జూనియర్ కళాశాల ఆవరణలో జీఓ ప్రతులను దహనం చేసి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోకి, కళాశాలల్లోకి విద్యార్థి సంఘాల నాయకులను నిషేధిస్తూ జీఓలను విడుదల చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్యాం నాయక్, సూరి, జగదీష్, జగన్, మహబూబ్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి

పగిడ్యాల: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో మొక్కజొన్న 2,492 హెక్టార్లు, వరి 530, సోయాబీన్ 124, పత్తి 68, కంది 79, పచ్చిమిర్చి 51 హెక్టార్లలో సాగైందన్నారు. ప్రతిపంట ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే కచ్చితమైన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌గా లక్ష్మికాంతరెడ్డి

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామ సింగిల్ విండో సొసైటీ చైర్మన్‌గా లక్ష్మి కాంతరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. రైతులు సొసైటీ నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని, తద్వారా మరికొంత మంది రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.